
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

సోమవారం 10 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:27 సోమవారం

సహర్ 5:07 మంగళవారం

ఎల్‌ఆర్‌ఎస్‌పై విస్తృత ప్రచారం



ఎల్‌ఆర్‌స్‌పై వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమ లే అవుట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు 2015 నుంచి వివిధ దశల్లో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పక్రియను ప్రారంభించింది. అప్పుడు వచ్చిన దరఖాస్తులను రెండేళ్ల పాటు పరిశీలించి క్రమబద్ధీకరించారు. మళ్లీ 2020 ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తెచ్చింది. లేఅవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానించారు. ప్లాట్లకు సంబంధించి రూవెయ్యి చొప్పున, లే అవుట్ క్రమబద్ధీకరణకు రూ.10వేల చొప్పున చెల్లించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ విషయంలో కొందరు కోర్టుకువెళ్లడంతో ఎల్‌ఆర్‌స్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ప్రభుత్వం కొంత ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకన్న వారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా క్రమబద్ధీకరణ జరగలేదు.

క్రమబద్ధీకరణకు ఎదురు చూపులు..

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకువచ్చిన 42,942 దరఖాస్తుల్లో 37,071 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. 4,896 దర ఖాస్తులు తిరస్కరించగా 975 మంది ఫీజులు చెల్లించారు. సిరిసిల్ల మున్సి పాలిటీలో 10,493 దరఖాస్తులు రాగా 8,038 దరఖాస్తులు పరిష్కరించారు. 2,386 దరఖాస్తులు తిరస్కరించారు. 69 దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. వేములవాడ మున్సి పాలిటీ పరిధిలో 16,336 దరఖాస్తులురాగా 14,676 దరఖాస్తులు పరిష్కరించారు. 1,632 దరఖాస్తులు తిరస్కరించారు. 28 దరఖాస్తు దారులు ఫీజులు చెల్లించారు. జిల్లాలో 260 గ్రామపంచాయతీలు ఉండగా 1,6113దరఖాస్తులు వచ్చాయి. వీటిలో14,357 దరఖాస్తులు పరిష్కరించారు. 878దరఖాస్తులు తిరస్క రించారు. 878మంది దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు.. ఒక్కో ప్లాట్‌కు గత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీసం రూ. 20నుంచి రూ. 50వేల వరకు ఆదాయం లభిస్తుంది. దీని ప్రకారం ప్రభుత్వానికి కనీసం రూ. 40కోట్లకు పైగా ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుల్లో సిరిసిల్ల మున్సిపాల్టీలో 10వేల 493 దరఖాస్తులు, వేములవాడ మున్సిపాల్టీలో 16,336 దరఖాస్తులు వచ్చాయి. గ్రామపంచాయతీల్లో..

మిగతా 8లో

- జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు
- మార్చి 31 వరకు ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ
- జిల్లాలో 42,942 దరఖాస్తులు
- 37,071 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించుకునే విధంగా సమాచారం
- జిల్లాకు రూ. 40 కోట్ల ఆదాయం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు రాయితీ ఇచ్చినా అనుకున్న స్థాయిలో స్పందన లేకపో వడంతో ప్రభుత్వం దరఖాస్తుదారుల్లో అవగాహన పెంచే విధంగా చర్యలు చేపట్టింది. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన పెంచే దిశగా దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌పై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో రియల్ ఎస్టేట్ నిర్వాహకులు, ఏజెంట్లు, లే అవుట్‌లు వేసిన యజమానులకు అవగాహన కల్పించనున్నారు. సదస్సులను జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొననున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేపట్టారు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా 42942 దరఖాస్తులు రాగా 37,071 దరఖాస్తులు పరిశీలించారు. 4,796 దరఖాస్తులు తిరస్క రించారు. 975 దరఖాస్తుల ఫీజులు చెల్లిం చారు. 37,071 మంది దరఖాస్తుదారులకు ఫీజులు చెల్లించి తమ ప్లాట్‌లను క్రమబద్ధీక రించుకోవాలని అధికారులు సమాచారం అందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి 25 శాతం రాయితీ ప్రకటించినా దరఖాస్తు దారులు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రాకపోవడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో భూముల ధరలు ఆశాజనకంగా లేకపోవడం, అమ్మకాలు లేకపోవడం, భూ సంబంధ వివాదాలు కేసులపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత లేకపోవడం వంటి కారణాలతోనే దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే అవగాహన కార్యాక్రమాల ద్వారా దరఖాస్తుదారులను ప్రోత్సహించాలని ప్రభు త్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి శుక్రవారం పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి దానకిషోర్ మార్చి 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు, ఖాళీ స్థలాల ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ కల్పించడం, సబ్ రిజిస్ట్రార్ లు నూతన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు స్వీకరిం చే విధంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశా లు ఇచ్చారు. అవగాహన సదస్సులు నిర్వహిం చి వేగవంతం చేయాలని భావిస్తున్నారు.

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న రైతుల నిరసన

ఇల్లంతకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని రైతులు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని రైతులు చేపట్టిన నిరసన దీక్షలో ఆదివారం వంటవార్పు చేపట్టారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. ఈ నెల 25న 12 గ్రామాల రైతులు దాదాపు 500ట్రాక్టర్లతో కలెక్టర్ కార్యాలయానికి వెలుతున్నామని పోలీస్‌శాఖ అనుమతించాలని విన్నవించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి బీజేపీ కృషి

కోనరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం బీజేపీ కృషి చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి బండి సంజయ్ మంజూరు చేసిన నిధులతో ఆదివారం భూమిపూజ చేసి మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాలాజీ, కోనరావుపేట మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, నాయకులు గొట్టే రామచంద్రం, జిల్లా నాయకుడు గోపాడి సురేందర్ రావు, బైరగొని సురేష్, ఎడ్ల సుధాకర్, మాజీ ఎంపిటిసి రేణుక, జితేందర్ రెడ్డి, శేఖర్, జయశ్రీ, మహేష్, కుమ్మరి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడకు మంత్రి పొన్నం

- స్వాగతం పలికిన ఈవో వినోద్‌రెడ్డి
- నేడు గౌడ సంఘ భవనం ప్రారంభోత్సవం



ఎస్పీ మహేష్ బాబా సాహెబ్‌తో చర్చిస్తున్న మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం రాత్రి చేరుకన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయానికి చేరుకున్న ఆయనకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బాబా సాహెబ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తదితరులు ఉన్నారు.

గౌడ సంఘ భవనాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం

వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మీ వీధిలో నిర్మించిన గౌడ భవనాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. సోమవారం ఉదయం 9 గంటలకు గౌడ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా భవనంలోని వసతి గదులను పరిశీలించారు. వారి వెంట గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి



కనగర్తిలో అల్లూరి విగ్రహం ఆవిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మహ నీయుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కోనరావుపేట మండలం కనగర్తిలో వృద్ధుల, వికలాంగుల, వితం తువుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్క రించారు. నాగారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చౌడమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంత రం మాట్లాడుతూ బ్రిటీష్ పరిపాలకుల చేతుల్లో మగ్గుతున్న భారత దేశాన్ని బ్రిటీష్ చెరనుంచి విడిపించడానికి పోరాటం చేసిన ఒక గొప్ప యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. 13 సంవత్సరాల క్రితం భూమి పూజ చేసుకొని నేడు మళ్లీ తన చేతుల మీదుగా ప్రారంభం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. 10 సంవ త్సరాలుగా వేములవాడ నియోజకవర్గంలో కుంటు పడ్డ పనులను ప్రారంభించడానికి ప్రజలు అవకా శాన్ని కల్పించారని, వారు పెట్టుకున్న నమ్మకాన్ని ఎక్కడ కూడా వమ్ము చేయకుండా నిలబెట్టుకుం టానని అన్నారు. నాడు జడ్పీటీసీగా, ఎంపీపీగా ప్రతిపక్షంలో ఉన్ననాడు మన ప్రాంతంలో అనేక నిధులు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. 13 నెలల క్రితం మీ బిడ్డగా మీరు ఇచ్చిన అవకాశా న్ని ఉపయోగించుకుంటూ వెనుకబడిపోయిన వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నానని తెలిపారు.. 2015 సంవత్సరంలో భూమి పూజ నిర్వహించిన వేము లవాడ బ్రిడ్జి నిర్మాణాన్ని నేడు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఎంతో ఉపయోగపడే మల్రిపల్లి రిజర్వాయర్, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్లను, లచ్చపేట తండా రిజర్వాయర్ కాలువ పనులు ముమ్మరంగా కొన సాగుతున్నాయని తెలిపారు. ఆనాడు ప్రతిపక్షంలో పోరాటం చేసిన 95 శాతం పనులను ఇప్పటికే పూర్తి చేశానని పేర్కొన్నారు. కోనరావుపేట మండ ల పరిధిలో బ్రిడ్జిలు త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా మీరు ఇచ్చే సూచన సలహాలు పాటిస్తూ ముందుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయ కులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకా యల ఎల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, ప్రజాప్రతినిధులు బండ నర్సయ్య, అనుపాటి బాపి రెడ్డి, శ్రీనివాస్, దేవరకొండ తిరుపతి, రుక్మిణి, బాపు రెడ్డి, తాళ్లపెల్లి ప్రభాకర్, భాస్కర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయ కులు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్‌కు సన్మానం



ఎస్పీ అఖిల్ మహాజన్‌కు జ్ఞాపిక అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీపై అదిలాబాద్‌కు వెళ్తున్న అఖిల్‌మహాజన్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అఖిల్‌మహాజన్‌కు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించి సన్మానించారు. వారి వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, టీపీసీసీ సభ్యులు సంగీతం శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం నర్సయ్య తదితరులు సన్మానించారు.

సత్యసాయి భక్తుల ద్విచక్రవాహన ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న సత్యసాయి భక్తులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని యువజన పత్తియాత్రలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో భక్తులు ఆదివారం ద్విచక్రవాహన ప్రదర్శన నిర్వహించారు. రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, సిరిసిల్ల మీదుగా తంగళ్లపల్లి వరకు యాత్ర కొనసాగింది.

లోపలి పేజీల్లో



కలెక్టర్‌కు సూచనలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న భక్తులను మోసం చేసిన బీఆర్‌ఎస్

- పది సంవత్సరాలైనా బ్రిడ్జి పనులను పట్టించుకోలేదు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడలో మూడో బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.85 కోట్లతో శంకుస్థాపన 7

- వేములవాడ టౌన్

కేజీబీవీలకు కార్పొరేట్ హంగులు

- పోటీ పరీక్షల్లో రాణించే విధంగా వీడియో పాఠ్యాంశాలు

8 - ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

వైద్యులు లేరు.. సేవలు అందవు

- నిరుపయోగంగా ఆయుర్వేద ఆసుపత్రి
- ప్రజలకు అందని వైద్యం



రాచర్లబొప్పాపూర్‌లోని ఆయుర్వేద కేంద్ర భవనం



తాళం వేసి ఉన్న గదులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ఆయుర్వేద వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయుర్వేద ఆసుపత్రికి నిర్లక్ష్యం జబ్బు పట్టుకుంది. ప్రజల ఆదరణ పొందిన ఆయుర్వేద వైద్యం అధికారుల అలసత్వం వల్ల అందకుండాపోతోంది. అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో దవాఖానా నిరుపయోగంగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో రూ.లక్షలు వెచ్చించి నెలకొల్పిన ఆయుర్వేద ఆసుపత్రికి తాళం పడింది. వైద్యం రోగులకు అందని ద్రాక్షగా మిగిలుతోంది.

సిబ్బంది లేక తెరచుకోని ఆసుపత్రి

రాచర్లబొప్పాపూర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఓ చీకటి గదిలో ఆసుపత్రిని నిర్వహించేవారు. ఆసుపత్రికి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుండడంతో భవనం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో గ్రామంలో స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి 20 ఏళ్ల క్రితం రూ.14 లక్షల నిధులకు మంజూరు చేసింది. పనులు పూర్తయినా భవనం వివాదంలో ఉండడంతో గత యేడాది వరకు జీపీలోని ఓ గదిలోనే ఆసుపత్రి కొనసాగించారు. యేడాది కిందట స్వంత భవనంలోకి ఆసుపత్రికి మార్చి సేవలను అందించారు. వైద్యశాలలో వైద్యాధికారి పోస్టు కొంత కాలంగా ఖాళీగా ఉంది. ఫార్మసిస్టు, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయుర్వేద ఆసుపత్రిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఎప్పుడు చూసినా తాళమే దర్శనమిస్తోంది. ప్రజలు నిత్యం ఆసుపత్రికి వచ్చి వేచి చూసి తిరిగి వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వం ఆయుర్వేద ఆసుపత్రికి పెద్ద పీట వేస్తున్న అధికారుల అలసత్వంతో వైద్య సేవలు అందకుండాపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైద్యాధికారిని నియమించడంతో పాటు ఆయుర్వేద ఆసుపత్రికి తాళం తొలగించి వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

- మొడుసు శ్రావణ్‌కుమార్, యువకుడు



గ్రామంలో ఉన్న ఆయుర్వేద దవాఖానాకు ఎప్పుడూ తాళమే కనిపిస్తోంది. వారం, పది రోజులకు ఎవరో ఒకరు వచ్చి ఓ గంట ఉండి వెళ్లిపోతున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలు నిత్యం చూసి వెళ్లిపోతున్నారు. అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి.

అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన చిన్ననాటి మిత్రులు ఒక చోట చేరి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శేఖర్, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, నాగేంద్రం, శ్రీనివాస్, దత్తత్రేయ, శ్యాం, సుందర్, చంద్రమోహన్, అంజల్‌రెడ్డి, మధుకర్‌లను ఘనంగా సన్మానించారు. వివిధ కారణాలతో మరణించిన చిన్ననాటి స్నేహితులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జితేందర్ రెడ్డి, జీవన్, విజయ్, షాదుల్లా, మహేశ్, హరిసాయికృష్ణ, స్రవంతి, గౌతమి, శ్రీమతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వేద పండితుడు రాచర్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రధాన దేవతాహవనం, మూలమంత్ర హవనం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపించారు. ఈ నెల 10న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నామని ఆల య కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని మొదటి బైపాస్ రహదారి మూలమలుపు వద్ద కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మహమ్మదాపూర్ గ్రామానికి తల్లీకొడుకులు మహేశ్వరి, హరికృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హరికృష్ణ తన తల్లి మహేశ్వరిలు కలిసి ద్విచక్రవాహనంపై కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న క్రమంలో ఎల్లారెడ్డిపేట మొదటి బైపాస్ రోడ్డు మూలమలుపు వద్ద స్కూటీ అడ్డుగా వచ్చింది. దాంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని చింతకుంట శివారులో ఉన్న 29/1 కంపార్ట్‌మెంట్‌లోని అటవీభూమిని అక్రమంగా చదును చేస్తున్న మూడు బ్లేడ్‌ట్రాక్టర్లను అటవీ అధికారులు పట్టుకున్నారు. శనివారం అర్ధరాత్రి భూమిని చదును చేస్తున్నట్టు అందిన పక్కాసమాచారం మేరకు దాడులు నిర్వహించామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి మస్తాక్ అలీ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను కథలాపూర్ పోలీస్ స్టేషన్‌కు బీట్ అధికారులు సాయిరాం, శివరాజ్, శ్రావణ్ కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది రాజు, రాజేశ్‌తో కలిసి తరలించామని చెప్పారు. అడవులను నరికివేసినా, ఆక్రమించేందుకు ప్రయత్నించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎఫ్ఎస్‌వో హెచ్చరించారు.

నిలిచిన పంప్‌హౌస్ పనులు

- గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రారంభం
- రూ.13.43 కోట్లతో కొండగట్టుపై శాశ్వత నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ
- వరదకాలువ నుంచి తరలింపునకు ప్రతిపాదనలు
- పంప్‌హౌస్ ఏర్పాటు తవ్వకాలతోనే నిలిచిన పనులు
- రూ.22కోట్లతో మళ్లీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు


సంతోళ్లలొద్ది రిజర్వాయర్

మల్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో శాశ్వత నీటి ఎద్దడి నివారణకు చేపట్టిన పంప్‌హౌస్ పనులు నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారం భించిన పనులు నత్తనడన సాగి ప్రస్తుతం పూర్తిగా ఆగి పోయాయి. అధికారుల రీడిజైన్‌తో పాటు పూర్తి స్థాయి ఎస్టిమేట్ అంటూ మళ్లీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంప డంతో ఈ పథకం పనులపై నీలినీడలు అలుముకున్నాయి. 2023 ఫిబ్రవరి15న కొండగట్టుకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. దేవస్థానం అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయిస్తామని ప్రకటించడంతో పాటు రూ.100కోట్లు విడుదల చేస్తున్నట్లు జీవో కూడా జారీ చేశారు. ఇందులో భా గంగా రూ.13.43కోట్లతో కొండపైన శాశ్వత నీటి సౌకర్యానికి నీటి లభ్యతను బట్టి కాళేశ్వరం జలాలు, ఎస్సారెస్పీ నీటిని వినియోగించడం కోసం ముత్యంపేట శివారులోని వరదకాలువ వద్ద పంప్‌హౌస్ పనులను ప్రారంభించారు. అయితే ఆ పను లు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. పూర్తి స్థాయిలో పథకం చేపట్టడానికి అంటూ ఇరిగేషన్ అధికారులు మళ్లీ ప్రతిపా దనలు తయారు చేయడం విమర్శలకు తావిస్తోంది. అధికా రులు రెండు సంవత్సరాల కాలంలో రెండుసార్లు ప్రతిపాదనలు రూపొందించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.


వరదకాలువ వద్ద నిలిచిపోయిన పంప్‌హౌస్ పనులు

● వరద కాలువ నుంచి పైప్‌లైన్

కొండపైన శాశ్వత నీటి సరఫరాకు ముత్యంపేట సమీపంలోని వరదకాలువ 81కి.మీ నుంచి నీటి సరఫరాకు గాను సుమారు 1.8కి.మీ దూరంలో గల సంతోళ్లలొద్దికి పైప్‌లైన్ ప్రతిపాదించారు. ఇం దుకు గాను వరదకాలువ వద్ద పంప్‌హౌస్ నిర్మించి ప్రెజర్ పంప్‌ల ద్వారా సంతోళ్ల లొద్దికి తరలించనున్నారు. నిత్యం 5 క్యూసెక్కుల నీరు తరలించేందుకు 2 భారీ పంప్‌మోటార్ల ఏర్పాటుకు నిర్ణయించారు. సంతోళ్లలొద్ది నుంచి మిషన్‌భగీరథ ద్వారా అంజన్న సన్నిధానంకు నీటిని పంపించ నున్నారు. అయితే ప్రస్తుతం సంతోళ్లలొద్ది సామర్థ్యం 358 ఎఫ్‌టీఎల్ మాత్రమే కాగా 370కి పెంచనున్నారు. దీంతో 2.50ఎంసీఎ ఫ్‌టీ నుంచి 13 ఎంసీటీఎఫ్‌కు పెరగనుంది. అయితే ఈ పనులన్నీ ఆరు నెలలోనే పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వరదకాలువ వద్ద రూ.కోటి విలువైన పంప్‌హౌస్ వద్ద తవ్వకాల పనులు మాత్రమే పూర్తి కాగా ఆరు నెలలుగా ఆ పనులూ నిలిచిపోయాయి. ప్రస్తుతం వరద కాలువకు శ్రీరాంసాగర్ ప్రా జెక్ట్ నుంచి నీటిని వదులుతుండగా ప్రాజెక్ట్‌లో నీటి మట్టం తగ్గినప్పుడు ఎల్లంపల్లి నీటిని వరదకాలువపై నిర్మించిన పంప్‌హౌస్‌ల ద్వారా కొన్నేళ్లుగా తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆ నీటిని కొండగట్టు పంప్‌హౌస్ ద్వారా కొండపైకి తరలించ డానికి కూడా ప్రతిపాదించారు. దీంతో కొండగట్టులో శాశ్వత నీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ చేపట్టగా ప్రస్తుతం పనులు మూలన పడడంతో పనులు త్వరితగతిన చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

రీఎస్టిమెట్‌తో ఆలస్యం

- సుధాకిరణ్, ఈఈ, ఇరిగేషన్

గతంలో పనుల ప్రారంభం కోసం అప్పటికప్పుడు ప్రతిపాదనలు రూపొందించి రూ.13.43కోట్లతో పనులు చేపట్టాం. అయితే భవిష్యత్తు అవసరాలు, పూర్తి స్థాయి పథకం చేపట్టడానికి ఇటీవల మళ్లీ రూ.22 కోట్లతో రీఎస్టిమెట్స్ తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వ అనుమతులు రాగానే పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య


వెంకవ్వ(ఫైల్)

మల్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన జేశెట్టి వెంకవ్వ(50) అనే మహిళ గురువారం రాత్రి నుంచి అదృశ్యం కాగా ఆమె మృతదేహం ఆదివారం జగిత్యాల మండలం అంతర్గాం సమీపంలోని కాకతీయ కెనాల్‌లో లభించింది. ఇంట్లోనుంచి వెళ్లిన వెంకవ్వ కెనాల్‌లో దూకిఆత్మహత్యకు పాల్పడినట్లు సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుండగా వెంకవ్వ అదృశ్యంపై మల్యాల పోలీసులు కేసు నమోదుచేశారు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెదుకుతుండగా కెనాల్‌లో మృతదేహం లభించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మతిస్థిమితం సరిగా లేకే ఇంట్లో నుంచి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నంబర్ ప్లేట్‌లేని బైక్‌లకు జరిమానా

మంథని, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నంబర్‌ప్లేట్లులేని వాహనాలు, ట్రిబుల్ రైడింగ్, అధిక శబ్దం వచ్చేలా సంచరిస్తున్న బైక్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐరమేష్ ఆదివారం తెలిపారు. నంబర్ ప్లేట్లు లేకున్న, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో దొరికిన వారికి కౌన్సెలింగ్ ఇచి జరిమానా విధించి వదలి పెట్టిన్నట్లు తెలిపారు.

కల్వర్టును ఢీకొని యువకుడు మృతి


నరేష్ (ఫైల్)

మానకొండూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కల్వర్టు ఢీకొని నరేష్ అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన గొర్రె వెంకటయ్య బంధువులు మండలంలోని కొండపల్కల గ్రామంలో శని వారం మృతిచెందారు. దీంతో వెంకటయ్య, అతని భార్య, కుమారుడు గొర్రె నరేష్(30) కలిసి బైక్‌పై అక్కడికి వెళ్లారు. రాత్రి సమయంలో తల్లిదండ్రులతోపాటు నరేష్ ఇంటికి తిరిగి వచ్చారు. కొండపల్కలలోనే ఇంటితాళం చెవి మరిచిపోగా నరేష్ బైక్‌పై మళ్లీ కొండపల్కలకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా పచ్చునూర్-మద్దికుంట గ్రామాల మధ్య ఉన్న కాకతీయ కాల్వ కల్వర్టుకు ఢీకొని కాల్వలో పడిపోయాడు. వెనకాల వెళుతున్న మరో వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు నరేష్‌ను అదే రాత్రి చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటయ్య ఆదివారం ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

బావిలో మట్టిగడ్డలు పడి ఒకరి మృతి

చందుర్తి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): బావిలో పూడిక మట్టి తీస్తుండగా పైనుండి మట్టిగడ్డలు కూలడంతో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో శని వారం రాత్రి జరిగింది. చందుర్తి ఎస్ఐ అంజయ్య కథనం ప్రకారం.. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన గద్దరాసి రాములు(48) అనే కూలీ వ్యవసాయ బావిలో పూడిక తీస్తుండగా పైనుంచి మట్టిపడడంతో కూలీ తలకు గాయాల య్యాయి. గాయపడ్డ రాములును చికిత్సనిమిత్తం వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ సంఘ టనపై మృతుడి భార్య నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఒకకొడుకు, ఒక కూతురు ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి


అవినాష్ (ఫైల్)

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లిలో ఈతకు వెళ్లిన అవినాష్‌రెడ్డి (15) అనే బాలుడు బావిలో మునిగి మృతిచెందాడు. కాట్నపల్లి గ్రామానికి చెందిన మోరపల్లి రత్నాకర్‌రెడ్డి ఒకే ఒక్క కుమారుడైన అవినాష్‌రెడ్డి తన ఇంటి పక్కను ఉన్న మరో బాలుడు (6)తో కలసి సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. అవినాష్‌రెడ్డి ఈత కొట్టేందుకు బావిలో దిగాడు. ప్రమాదవశాత్తు బావిలో మునిగిపోతుండగా బావి గట్టు మీద ఉన్న బాలుడు వెంటనే ఇంటి వద్దకు వెళ్లి కుటుంబసభ్యులకు తెలిపాడు. పలువురు బావిలో దిగి అవినాష్ రెడ్డిని బటయకు తీసి అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఒకే ఒక్క కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. బాలుడి మృతదేహన్ని పోస్టమార్టం నిమిత్తం సుల్తానా బాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఒకరి బలవన్మరణం


సంపత్‌రెడ్డి(ఫైల్)

చిగురుమామిడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ని సీతారాంపూర్ గ్రామానికి చెందిన కొండం సంపత్‌రెడ్డి(48) అప్పుల బాధలు భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బండిరాజేశ్ ఆదివారం తెలిపారు. వ్యవ సాయం కోసం, ఇతర కుటుంబ అవసరాల కోసం దాదాపు 8లక్షలరూపాయల వరకు అప్పులు ఉన్నాయి. అప్పుల బాధభరించలేకు ఇంట్లో ఎవ రూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని యువతి ఆత్మహత్య

కొడిమ్యాల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామానికి చెందిన మన్నెగుంట్ల పుష్పలత(24) అనే యువతి మతిస్థిమితం సరిగాలేక ఆదివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జ రాజు తెలిపారు. పుష్పలతకు కొన్నేళ్ల నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది దమ్మయ్యపేట గ్రామ శివలింగాల గుట్టపై చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కార్మిక, కళా సాంస్కృతిక సేనాని జాకబ్

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


జాకబ్ విగ్రహావిష్కరణ చేస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

కోల్‌సిటీటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రజా, కార్మిక కళాక్షేత్రంలో సాంస్కృతిక సేనానిగా జాకబ్ సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గోదావరిఖని న్యూఅశోకథియేటర్ వద్ద ఏర్పాటు చేసిన జాకబ్ విగ్రహాన్ని చాడ వెంకటరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన స్మారక సభలో ఆయన మాట్లాడారు. ప్రజా కళాకారుడు జాకబ్ కళారంగానికి, కార్మికక్షేత్రానికి చిరస్మరణీయుడని కొనియాడారు. జాకబ్ సింగరేణి ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే సీపీఐ, ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న ప్రజానాట్య మండలిలో జాతీయ స్థాయిలో ప్రజలకు, కార్మికులహక్కుల కోసం, వారి సంక్షేమం కోసం తనరచనలు, పాటలతో సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారుడు దయానర్సింగ్ రచించిన జాకబ్ స్మృతిగీతం సీడిని మాజీ ఎమ్మెల్యేలు చాడవెంకటరెడ్డి, కాసిపేట లింగయ్య ఆవిష్కరించారు. ఇప్టాజాతీయ నాయకులు కె.స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె శంకర్, మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య, సీపీఐ నాయకులు తాండ్ర సదానందం, సీనియర్ జర్నలిస్టులు మాదాసు రాంమూర్తి, మల్లావఝుల వంశీ, కవి, రచయిత బానూరి సత్యనారాయణ, తారా కల్చరల్ అకాడమి బాధ్యులు సంకె రాజేష్, జాకబ్ సోదరి యాంజిలాడెవిస్, మంచిర్యాల జిల్లా సీపీఐ నాయకులు రామడుగు లక్ష్మణ్, బెల్లింపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, సీపీఐ పూర్వ జిల్లా కార్యదర్శి గోసిక మోహన్, ప్రజానాట్య మండలి నాయకులు కన్నం లక్ష్మీనారాయణ, జాకబ్ సతీమణి లలితాజాకబ్, కవులు కళాకారులు రాకుమార, చంద్రపాల్, ఎల్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్రజల సంక్షేమమే ధ్యేయం

● గర్షకుర్తి బస్సు పునరుద్ధరణ

● పంటలు ఎండుతున్నాయని ఎమ్మెల్యే సత్యంకు రైతుల మొర


బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం గంగాధర మండలం కురిక్యాల నుంచి గర్షకుర్తి మీదుగా వేములవాడకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కురిక్యాలలో బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే గర్షకుర్తి వరకు బస్సులో టిక్కెట్టు తీసుకుని ప్రయాణించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రావు,తాజామాజీ సర్పంచ్ అలువాల నాగాలక్ష్మీ,నాయకులు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, మహిళలు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయి..

గర్షకుర్తికి బస్సును ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గ్రామరైతులు నీరులేక వరిపొలాలు ఎండుతు న్నాయని నిలదీశారు. రైతుబంధు, రుణమాఫీ ఏదీ అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎక్కడ పంటలు ఎండు తున్నాయో చూపిం చాలని ఎమ్మెల్యే అన్నారు. దీంతో రైతులు ఆయనను ఎండుతున్న పొలాల వద్దకు తీసుకెళ్లారు. పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రైతులతో మాట్లాడుతూ పంటలు ఎండి పోకుండా అధికారులతో మాట్లాడి నీరందించ డానికి కృషి చేస్తానని తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో నిల్వఉంచిన 17సంచుల రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని సేకరించి నిజామాబాద్ జిల్లాకు తరలించడానికి వెల్లుల్లలో నిల్వ చేసినట్లు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులకు దాడులు నిర్వహించగా అక్రమంగా నిల్వచేసిన 8.95 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించామన్నారు. అధికారులు తనిఖీ చేస్తుండగా వ్యాపారస్థుడు గమనించి అక్కడి నుంచి పారిపోయా డన్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించామన్నారు. రేషన్ బియాన్ని పట్టుకున్న సిబ్బందిని సీఐ నిరంజన్‌రెడ్డి అభినందించారు.

బిట్టుపల్లి శివారులో పులి అడుగుల గుర్తింపు

● ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు


పులి పాదముద్రలను గుర్తిస్తున్న అటవీ అధికారులు

మంథనిరూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి శివారులో శనివారం రాత్రి సంచరించిన పులి పాదముద్రలను ఆదివారం అటవీ శాఖ అధికారులు గుర్తించారు. బిట్టుపల్లి శివారులో పెద్దపులి సంచారాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి చూడటంతో ఫారెస్టు, పోలీసులు సిబ్బంది రాత్రి నుంచి పులిజాడ కోసం పరిశీలించారు. బిట్టుపల్లి వైపు వెళ్లిన పులి తెల్లవారుజామున తిరిగి గోపాల్‌పూర్ వైపు వెళ్లినట్లు పులి పాదముద్రలను ఫారెస్టు సిబ్బంది గుర్తించారు. గోపాల్‌పూర్ శివారులోని కాలువ వరకు, పంట చేల్ల వరకు పులి అడుగులు ఉన్నాయి. అయితే పెద్దపులి గోపాల్‌పూర్ లేదా శాస్త్రులపల్లి అటవీ ప్రాంతం వైపు వెళ్లి ఉంటుందని ఫారెస్టు అధికారులు తెలిపారు. రెండురోజులుగా పులి పాదముద్రలు అధికారులు గుర్తించడంతో బిట్టుపల్లి, గోపాల్‌పూర్, శాస్త్రులపల్లి, చిన్న ఓదాల అటవీ ప్రాంతాలకు చెందిన ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొలాలు, అటవీ ప్రాంతానికి రాత్రి పూట వెళ్ల వద్దని ఫారెస్టు డిప్యూటీ రేంజర్ రమేష్ కోరారు.

కోర్టు ప్రాంగణంలో ఇరువర్గాల వాగ్వాదం

కోల్‌సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పోచమ్మ మైదాన్ భూవివాదంలో నమోదైన కేసుల రాజీ విషయంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం ఇరువర్గాల మధ్యవాగ్వాదం జరిగింది. కోర్టు ప్రాంగణంలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాల వారిపై శనివారం రాత్రి అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు న్యాయవాది, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్‌పై అట్రాసిటీ కేసునమోదైంది. న్యాయవాది ఎరుకల ప్రదీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీజేపీ నాయకుడు సుల్వ లక్ష్మీనర్సయ్య, పెద్దపెల్లి రవీందర్, శివాజీ నగర్‌కు చెందిన తోట వేణుపై అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. కేసుకు సంబంధించిన గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పోచమ్మ మైదాన్ స్థలాల విషయంలో గతంలో అఖిలపక్షంగా ఏర్పడి పోరాడారు. ఈవిషయమై కోర్టు సిఫార్సుమేరకు కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి యుగంధర్, బీజేపీ నాయకులు సుల్వ లక్ష్మీనరసయ్య, పెద్దపల్లి రవీందర్‌పై కేసులు నమోదయ్యాయి. శనివారం లోక్‌అదాలత్ సందర్భంగా కేసులో రాజీ పడేందుకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పిటిషన్ దారులతో మాట్లాడుతున్నారు. వీరికి న్యాయవాదిగా ఉన్న తౌటం సతీష్ తనను కాదని ఎలా రాజీ పడతారని అడ్డుచెప్పాడు. ఈవిషయమై ప్రశ్నించినందుకు తనను దూషించినట్లు తాళ్లపల్లి యుగంధర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు అడ్వకేట్ సతీష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కాగా మహిళా దినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ వద్ద కార్యక్రమం జరుగుతుందని, ఆసందర్భంలో ఇరువర్గాలు గొడవ పడుతుండగా మధ్యలో వెళ్లి కోర్టు ప్రాంగణంలో గొడవ పడవద్దని చెప్పినందుకు తనను కులం పేరుతో దూషించినట్లు న్యాయవాది ఎరుకల ప్రదీప్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు సుల్వ లక్ష్మీ నర్సయ్య, పెద్దపల్లి రవీందర్, తోట వేణులపై అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు.

బ్యాటరీలు ఎత్తుకెళ్లిన నిందితుల అరెస్టు


దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు


సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ లారీ అసోసియేషన్ ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న లారీల నుంచి బ్యాటరీలను దొంగిలించుకుపోయిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈనెల 3వ తేదీన శాస్త్రినగర్ వద్ద నిలిపి ఉంచిన లారీలకు సంబంధించిన 22బ్యాటరీలను దొంగతనం చేశారు. ఈ మేరకు లారీల యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన సుల్తానాబాద్ పోలీసులు ఆదివారం నిందితులను పట్టుకున్నారు. చోరీ చేసిన బ్యాటరీలను ఓ కారులో కరీంనగర్ తరలిస్తుండగా సుల్తానాబాద్ వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో పట్టుబడ్డారని ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా సీసీసీకి చెందిన శ్రీను, మహేష్ పట్టుబడగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాటరీలను దొంగిలించినట్టు తేలిందని ఎస్ఐ తెలిపారు. గతంలో వీరు అనేక దొంగతనాలు చేసి జైలు జీవితం కూడా గడిపారని జల్సాల కోసం తరుచూ చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు.

రెండు బైకులు ఢీ

● ఐదుగురికి తీవ్రగాయాలు

తిమ్మాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామ రాజీవ్‌రహదారిపై రెండుబైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకుల మీద ఉన్న ఐదుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి మహాత్మానగర్ గ్రామ రాజీవ్ రహదారిపై వెళుతున్న ఓ ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈసంఘటనలో మహాత్మానగర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీడాక్టర్ శంకరయ్యతోపాటు మరో ముగ్గురుయువకులు తీవ్రంగా గాయ పడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న తిమ్మాపూర్ సీఐ స్వామి క్షతగాత్రులను స్థానికుల సహాయంతో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో రామకృష్ణ కాలనీచెందిన ముగ్గురు యువకులు తిమ్మాపూర్‌కు సంబంధించి ఇద్దరు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- ధర్మపురిలో నేటి నుంచి 22వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ధర్మపురి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 22 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయం పక్షాన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిర్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఆలయాలు, గోపురాలకు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిర్లు, దుస్తుల మార్పిడి కోసం తాత్కాలిక గదులు ఏర్పాటు చేయించి, స్నానాలు చేసేందుకు షవర్స్ కూడా ఏర్పాటు చేశారు. ఉత్సవాలు తిలకించేలా ఆలయాలు, కూడళ్ల వద్ద స్క్రీన్స్ ఏర్పాటు చేశారు.

● బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు

తొలిరోజు యజ్ఞాచార్యుల ఆహ్వానం, కళశ, విశ్వక్‌సేన, వాసుదేవ, పుణ్యాహవచనం, బ్రహ్మ కలశ స్థాపన, అంకురార్పణ, వరహా తీర్థం, పుట్ట బంగారం తెచ్చుట వంటి కార్యక్రమాలు ఉంటాయి. మంగళవారం స్వామివారల కల్యాణోత్సవం, 12న లక్ష్మీ నరసింహస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. 13న వేంకటేశ్వర స్వామి ఊరేగింపు, 14న బ్రహ్మ పుష్కరిణిలో శ్రీ యోగ (పాత) నృసింహస్వామి తెప్పె, డోలోత్సవాలు, 15 న బ్రహ్మ పుష్కరిణి(కోనేరు)లో శ్రీ ఉగ్ర (కొత్త) లక్ష్మీ నృసింహ స్వామి తెప్పె, డోలోత్సవాలు ఉంటాయి. 16న బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పె, డోలోత్సవాలు, సాయంత్ర 4 గంటలకు లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ఉంటుంది. 17న సాయంత్రం 4 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి 8 గంటలకు భోగ మండప ఉత్సవం, 9 గంటలకు వేద సదస్సు నిర్వహిస్తారు. 18న సాయంత్రం 4 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి, దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి 8 గంటలకు డోపోత్సవం, 19న మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు చక్రతీర్థం, రాత్రి 9 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారల పుష్పయాగం ఉంటుంది. 20న రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు శ్రీ యోగ (పాత) లక్ష్మీనర్సింహ స్వామి ఏకాంతోత్సం, 21న రాత్రి 7 గంటలకు శ్రీ కొత్త (ఉగ్ర) నరసింహ స్వామి పుష్పయాగం, రాత్రి 9 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవం నిర్వహిస్తారు. 22 న రాత్రి 9 గంటలకు శ్రీ కొత్త (ఉగ్ర)నారసింహస్వామిఏకాంతోత్సవాలు ఉంటాయి.

● క్షేత్రంలోని ఆలయాలు

ధర్మపురి క్షేత్రంలో చూడదగిన ఆలయాల్లో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ యమ ధర్మరాజు, సంతోషిమాత, శ్రీ రామ, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ గడ్డ ఆంజనేయ స్వామి, శ్రీ శివ సాయిబాలాజీ, అయ్యప్ప స్వామి, శ్రీ భక్త మార్కండేయ, గోదావరి మాత, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ, సత్యవతి (ఇసుక స్తంభం), మహాలక్ష్మి ఆలయాలు ఉన్నాయి. క్షేత్ర సమీపంలో శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి, తిమ్మాపూర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయాలు ఉన్నాయి.



యమ ధర్మరాజు ఆలయం

● అతిథులకు ఆహ్వానం

బ్రహ్మోత్సవాల కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ ఎం.సంజయ్‌కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ లకు ఆహ్వానం అందించామని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. స్వామి వారల కల్యాణోత్సవం కోసం ప్రభుత్వం తరపున కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఈవో పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

-ఈవో శ్రీనివాస్



లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేశాం. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాం. గోదావరి నది, స్నానఘట్టాల వద్ద పందిర్లు, స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరై స్వామి వారిని దర్శనం చేసుకోవాలి.





సుల్తానాబాద్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం

విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన ఆలయం, స్వామి వారికి విశేషాలంకరణ
- 10న రాత్రి కల్యాణోత్సవం, 12న రథోత్సవం

సుల్తానాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీసత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కాను న్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆల యాన్ని అందంగా రంగులతో ముస్తాబు చేశారు. గర్భగుడిలోని మూలస్వామి వారిని విశేషంగా అలకంరించారు. ఉత్సవమూర్తులకు కిరీటాలు ఇతర అభరణాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం విశ్వక్సేన అరాధన, పుణ్యావచనం, అంకురార్పణం, ధ్వజారోహణం, గరుడ బలి, యాగ శాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ వంటి పూజా కార్యక్రమాలు ఉంటాయి. సోమవారం సాయంత్రం వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో ఎదురు క్కోళ్లు అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి కల్యాణం నిర్వహిస్తారు. 12వ తేదీన స్వామివారి రథోత్సవం జరుగుతుంది. ఆలయంలో ప్రతీ ఏటా ఫాల్గుణ మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహి స్తారు. వారం రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. విశేష పూజలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- పల్లా మురళీధర్, ఆలయ చైర్మన్




సోమవారం నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. భక్తులకు అన్ని వసతి సౌకర్యాలు కల్పించాం. సోమ వారం కల్యాణం, మంగళవారం నిత్యావహణం, తాళాలు, బలిహ రనం తీర్థప్రసాద పంపిణీ ఉంటుంది. బుధవారం రథోత్సవం నిర్వహిస్తారు. స్వామి వారిని రథంపై ప్రతిష్ఠించి శోబాయాత్ర నిర్వ హిస్తాము. ఇందులో భాగంగా గుడిమిట్ట ఆలయంలో చక్రస్నానం, తెప్పోత్సవాలు జరుగుతాయి.

జీవన్‌రెడ్డి, చాడ వెంకట్‌రెడ్డికి నిరాశ

● ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వని అధిష్ఠానాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మాజీమంత్రి, సీనియర్ కాంగ్రెస్‌నేత టి జీవన్‌రెడ్డి రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఎమ్మెల్యేకోటా ఎమ్మెల్సీలలో ఆయనకు ఏఐసీసీ అవకాశం ఇవ్వక నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీగా ఉన్న ఆయన పదవీ కాలం ఈనెలతో ముగియనున్నది. పట్టభద్రుల ఎమ్మెల్సీస్థానంలో ఆయనపేరును టీపీసీసీ ప్రతిపాదించినా ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆయన సుముఖంగా లేకపోవడంతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ఆ సందర్భంలో తనకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో అవకాశం కల్పించాలని జీవన్‌రెడ్డి అధిష్ఠానాన్ని కోరినట్లు ప్రచారం జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉమ్మడి జిల్లారాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల అనంతరం ఏడాది కాలానికి జగిత్యాల శాసన సభ్యుడిగా గెలిచిన బీఆర్‌ఎస్‌నేత డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరిన సందర్భంలో జీవన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు, శ్రేణులు ఆందోళనకు దిగగా అధిష్ఠానం మంత్రిశ్రీధర్‌బాబును జీవన్‌రెడ్డి వద్దకు పంపించి బుజ్జగించింది. జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో జీవన్ రెడ్డి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అధిష్ఠానం ఆయనకు హామీ ఇచ్చారు. ఆయనకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో అవకాశం లభిస్తుందని అందరూ ఆశించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నలుగురు సభ్యులను గెలిపించుకునే ఎమ్మెల్యేల బలంఉండగా ఏఐసీసీ విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్‌కు అవకాశం కల్పించింది. మరోస్థానాన్ని మిత్రపక్షమైన సీపీఐకి కేటాయించింది. సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ సీపీఐకి ఒకస్థానాన్ని కేటాయించాల్సి వచ్చిన కారణంగా జీవన్‌రెడ్డికి అవకాశం దక్కకుండా పోయిందని ప్రచారం జరుగుతున్నది. ఐదు దశాబ్దాల జీవన్‌రెడ్డి రాజకీయ జీవితంలో మరోపదవి ఏదైనా లభించి కొనసాగే అవకాశం ఉందోలేదో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



జీవన్‌రెడ్డి



చాడ వెంకట్‌రెడ్డి

● 'చాడ'కు ఆశాభంగమే..

శాసన మండలి ఎన్నికల్లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆశాభంగమే ఎదురయ్యింది. శాసన మండలి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం పేరు ఖరారైంది. హైదరాబాద్‌లోని ముఖ్దూం భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. దీంతో ఎమ్మెల్సీగా చాడ వెంకట్‌రెడ్డి పేరును ఖరారు చేస్తారని భావించినా చివరకు నెల్లికంటి సత్యం పేరును ఆ పార్టీ ఖరారుచేస్తున్నట్లు ప్రకటించింది. 2023లో పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్ ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించి రాష్ట్రమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చాడ వెంకట్‌రెడ్డికి అవకాశం తప్పకుండా వస్తుందని సీపీఐ జిల్లా నేతలు భావించినా చివరకు పార్టీ నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. దీంతో చాడ వెంకట్‌రెడ్డికి ఆశాభంగంతప్పలేదు.

రాజన్న భక్తులను మోసం చేసిన బీఆర్‌ఎస్

- పది సంవత్సరాలైనా బ్రిడ్జి పనులను పట్టించుకోలేదు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మూడో బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.85 కోట్లతో శంకుస్థాపన

వేములవాడ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి వస్తే చాలు రంగురంగు బ్రౌచర్లతో మూడో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిందని, వాటిపై మోటర్ సైకిళ్ల వెళ్లాయని ప్రజలను, రాజన్న భక్తులను మోసం చేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది అని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మూలవాగుపై అసంపూర్తిగా వున్న మూడవ బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణానికి రూ. 6.85 కోట్ల వ్యయంతో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలకుల నిర్లక్ష్యం వలన పది సంవత్సరాలుగా పడవుపడ్డ బ్రిడ్జి పునర్‌నిర్మాణానికి నేడు ప్రజా ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని అన్నారు. 2015వ సంవత్సరంలో బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసి పదిసంవత్సరాలు పూర్తయినా పట్టించుకోలేదన్నారు. అంతేకాకుండా మర్రిపెల్లి, లచ్చపేట రిజర్వాయర్‌లు చందుర్తి-మోత్కురావుపేట రోడ్డు నిర్మాణపనులు వేయలేక పోయారని గత ప్రభుత్వాన్ని నిందించారు. సదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో జిల్లా కలెక్టర్ చొరువతో అనేక నిధులను మన ప్రాంతానికి తెచ్చి అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. గత నెలలో సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పట్టణంలో సుమారుగా రూ. 700 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. రూ.47 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు, రూ.35 కోట్లతో నిత్య అన్నదాన సత్రం, ఆలయ విస్తరణ చేపట్టడం జరుగుతుందని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్రంగా దర్శనం కలిగించేలా ఆలయ విస్తరణ చేపడుతున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడిందని విమర్శించారు. ఈ ప్రాంతానికి నాణ్యమైన విద్యను అందించాలని రుద్రంగి మండల కేంద్రంలో ఏటీసీ కాలేజి, మేడిపెల్లి జూనియర్ కళాశాల మంజూ రు చేయడం జరిగిందన్నారు. తొమ్మిది మాసాల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు వెడల్పు కూడా పూర్తి చేస్తామని, ఎవరు కూడా ఎలాంటి అపోహ పెట్టుకోవద్దని, ఎలక్షన్ కోడ్ రావడంతో కొంత ఆలస్యం అయిందని వివరించారు. ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా ఎవరికీ ఏఇబ్బంది రాకుండా చూసుకుంటానని, రైల్వేలైన్‌లో భూమి పోతున్న వారికి కూడా తప్పకుండా న్యాయం చేస్తామని అన్నారు.



బ్రిడ్జి నిర్మాణపనులను మ్యాప్ ద్వారా పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

ఆలయ విస్తరణ పనులు ప్రారంభం చేయడం జరుగుతుందని, మే నెలలో శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర్ శర్మ రాజన్న ఆలయానికి వస్తారని తెలిపారు. బస్‌డిపో వద్ద నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు చేపడుతామని, రెండవ బైపాస్‌రోడ్డుల రూ. 80లక్షలతో అన్ని ఒకేరకంగా కూరగాయాల సముదాయం ఏర్పాటుచేయడం జరుగుతుం దని అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉండి మనందరం కొట్లాడిన 95 శాతం పనులను పూర్తి చేశామని, గంగమ్మ దేవాలయానికి ఒక నడిచి పోయే ట్రాక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, మహ్మద్ అక్రమ్, నీలం గురువయ్య తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీనెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్నఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారుజామునే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకుని రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు శ్రీభీమేశ్వర, శ్రీకేదారేశ్వరఆలయాల్లో అభిషేకపూజలో పాల్గొనితరించగా శ్రీబద్దిపోచమ్మ అమ్మవారికి పట్నాలువేసి నైవేద్యాన్ని సమర్పించిమొక్కులు చెల్లించుకున్నారు.

కొండగట్టులో.. పవిత్రోత్సవాలకు అంకురార్పణ

మల్యాల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో మూడు రోజులపాటు జరిగే పవిత్రోత్సవాలకుగాను ఆదివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. యాగశాలలో ఆలయ అర్చకులు విష్వక్సేన ఆరాధన, పుణ్యహవాచనం, అంకురారోహణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాలు జరుపుతున్న అర్చకులు

'మౌనిక'మ్మ పెళ్లి కూతురాయెనే..

- అధికారులు అండగా నిలిచి అనాథ యువతి పెళ్లి
- కలెక్టర్ ఆధ్వర్యంలో వైభవంగా వివాహం
- పెళ్లి పెద్దగా వ్యవహరించిన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాజా భజంత్రీలు... మేళ తాళాలు.. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య.... పెద్ద ఎత్తున తరలి వచ్చిన అతిథుల సమక్షంలో.... మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ పెళ్లి పెద్దగా ఓ అనాథ యువతి వివాహం కరీంనగర్‌లో వైభవంగా జరిగింది. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం స్థానిక కళాభారతిలో ఆదివారం బాలసదనంలో పెరిగిన బాలికకు అన్నీ తామై వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళితే..

మౌనిక (పూజ) తన తల్లిదండ్రులను కోల్పోవడంతో 2017 సంవత్సరంలో బంధువులు కరీంనగర్‌లోని బాల సదనంలో చేర్పించారు. బాలసదనంలో అధికారులు ఆమెకు చదువు చెప్పించారు. మౌనిక ఇంటర్ తర్వాత ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సు చదువుతుండగా పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సాయితేజతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మౌనిక చదువు పూర్తి చేసుకుని నర్సింగ్ ఉద్యోగం చేస్తోంది. ఇటీవల బాలసదనం అధికారు లకు తన ప్రేమ విషయం చెప్పింది. అధికారులు సాయితేజతోపాటు అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అతడి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించడంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పెళ్లి నిశ్చయించారు. అధికారులే పెళ్లి పెద్దలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పెళ్లికి వచ్చే అతిథులకు భోజనం ఏర్పాటు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి వివా హానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అందరూ కలిసి మౌనిక వివాహాన్ని అంగరంగ వైభవంగా జరిపించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అనాథలకు మేమున్నామనే భరోసాను కల్పించారు. కార్యక్రమంలో డీసీపీవో పర్వీన్, స్టేట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యురాలు శోభారాణి, మున్సిపల్ డిప్యూటి కమిషనర్ స్వరూపారాణి పాల్గొన్నారు.



నూతన వధూవరులకు దుస్తులు అందిస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి



వధువును అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



వధూవరులకు నగదు బహుమానం అందజేస్తున్న టీఎన్‌జీవో, టీజీవో ఉద్యోగులు, పెన్షనర్స్

మౌనికకు వివాహం చేయడం ఆనందంగా ఉంది

- పమేలా సత్పతి, కలెక్టర్

మౌనికకు జిల్లా యంత్రాంగం తరపున వివాహం చేయడం ఆనందంగా ఉంది. మౌనికకు ముగ్గురు చెల్లెలు ఉన్నారు. మౌనిక నర్సింగ్ చదివి ప్రయోజకురాలిగా మారింది. ఆమెను ఉన్నత చదువులు చదివించాలని సాయితేజతోపాటు, వారి కుటుంబ సభ్యులకు సూచించాము. అనాథలు ఎవరూ బాధపడవద్దు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. మౌనిక కుటుంబానికి అండగా ఉంటాము. అనాథలకు ప్రభుత్వం తోడుగా ఉంటుంది.

అనాథలకు అండగా ఉంటాం..

- కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే

అనాథలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దన్నగా నిరంతంగా తోడుగా ఉంటున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనాథ యువతి వివాహం ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో జరిపించడం అభినందనీయం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నారన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

- సవిత, జిల్లా సంక్షేమ అధికారి

మౌనిక వివాహం కలెక్టర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదాయ బద్ధంగా హల్దీ, మెహందీ ఫంక్షన్ నిర్వహించాము. వివాహానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివాహం జరిపించడం సంతోషంగా ఉంది.

● టీజీవో, టీఎన్‌జీవో, పెన్షనర్స్ సహకారం

సుభాష్‌నగర్: మౌనిక వివాహానికి టీజీవో, టీఎన్‌జీవో, నాలుగో తరగతి ఉద్యోగులు, పెన్షనర్లు తమ సహాయ, సహకారలను అందించారు. మహిళ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పుస్తె మట్టెలు, ఇతర పెండ్లి సమానులు సమకూర్చారు. టీజీవో నాయకులు 54 వేల రూపాయల చెక్కును, 20 వేల రూపాయల విలువైన బెడ్స్, బీరువా, డ్రెస్సింగ్ టేబుల్, ఇతర ఫర్నీచర్ అందజేశారు. పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పెండ్యాల కేశవరెడ్డి రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి 15 వేల రూపాయలు, మార్కెటింగ్ డీడీ పద్మావతి 10 వేల నగదు అందించారు.

పందుల సంచారంతో ప్రజల ఇబ్బందులు



కాలనీల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి వార్డులో పందుల బెడద అధికమైంది. మురుగు నీటి కాల్వల్లోకి చేరి ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. ఇళ్లలోకి దూరి ప్రజలను భయపెడుతున్నాయి. పందుల సంచారం వల్ల ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల వల్ల వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను దూర ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో విశ్రాంత మండల పరిషత్తు అటెండర్ పుల్లూరి మైసయ్య గుండె పోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, రజక సంఘం నాయకులు బాలమల్లు, శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. పదిరలో ఇటీవల బీజేపీ నాయకుడు రేపాక రామచంద్రం తల్లి మరణించారు. ఆయన కుటుంబాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు గోపి పరామర్శించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ జన్మదిన వేడుకలు

ఇల్లంతకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాదుల్, సావనపెల్లి అనీల్‌కుమార్, రఘు, రాములుయాదవ్, కొట్టె వెంకన్న, చందన్, మహేష్, అంతగిరి భాస్కర్, నర్సయ్య ప్రేమ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



శ్రీగాదలో గిరేందర్‌రావును సన్మానిస్తున్న పర్శ హన్మండ్లు, ప్రజలు

గంభీరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం శ్రీగాద గ్రామంలో గిరేందర్‌రావుకు ఆదివారం ఘన సన్మానం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గిరేందర్‌రావును శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్శ హన్మండ్లు మాట్లాడుతూ పుట్టిన ఊరుకు తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో కేజీఆర్ సీసీ కెమెరాలు అందించాడని అన్నారు. కేజీఆర్ యూట్యూబ్ స్థాపించి, పత్రిక విశ్లేషణతో పాటు సామాజిక చైతన్యం కలిగించాడన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండి కేపీఆర్ జైలుకు కూడా వెళ్లాడని గుర్తు చేశాడు. కార్యక్రమంలో నాయకులు వేముల కాశాగౌడ్, కల్వకుంట్ల మోహన్‌రావు, గణేష్, శ్రీనివాస్, దేవయ్య, రాజు, కిషన్, ప్రశాంత్, వెంకటస్వామి, శ్రీకాంత్, స్వామి, నర్సింలు, లక్ష్మణ్‌రావు, రాము, శ్రావణ్‌రావు ఉన్నారు.

ఘనంగా చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నాగారంలో చౌడ మహోత్సవాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

కోనరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారం గ్రామంలో యాదవుల ఆరాధ్య దైవమైన చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో భారతీయ జనతా పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌బాబు, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు పల్లం అన్నపూర్ణ, కోనరావుపేట మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, బిజెపి ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, మహిళా మోర్చ అధ్యక్షులు జయశ్రీ, మాజీ అధ్యక్షుడు గొట్టే రామచంద్రం, గోపాడి సురేందర్ రావు, ఎడ్ల సుధాకర్, జితేందర్, పొన్నం మహేష్, మోహన్ పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం

చందుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో అధ్యయన బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి ఈ నెల 14 వరకు ఆరు రోజుల పాటు అధ్యయన బహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న బుధవారం ఉదయం 11.45 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అర్చకులు కొదమగుళ్ల శ్రీకాంత ఆచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండ లక్ష్మణ్ గౌడ్, కమిటీ సభ్యులు కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. చలువ పందిల్లు, మంచినీరు ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

సుభాష్‌నగర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, అప్పటి వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు, ఫలితాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించకుండా గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉద్యోగాల ఫలితాలను నిలిపివేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని, వర్గీకరణ అమలు చేయకుండానే డీఎస్సీ వేశారన్నారు.

కేజీబీవీలకు కార్పొరేట్ హంగులు

● పోటీ పరీక్షల్లో రాణించే విధంగా వీడియో పాఠ్యాంశాలు ● దృష్టిసారించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దే విధంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సర్కారు బడిలో సీటు సాధించుకోవాలనే స్థాయికి చేరుకున్నాయి. అధునిక భవనాలతో పాటు ఉచిత పుస్తకాలు, ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు పోటీ పరీక్షల్లో రాణించే విధంగా శిక్షణ అందిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రత్యేక దృష్టి సారించడంతో విద్యార్థులకు అందించే భోజన ప్రక్రియలోనూ మార్పులు వచ్చాయి. బ్లాక్ బోర్డు స్థానంలో డిజిటల్ బోర్డులతో సర్కారు బడి స్మార్ట్ తరగతి గదులతో ముందుకు సాగుతోంది.

13 కస్తూర్బా పాఠశాలల్లో మార్పులు

జిల్లాలో 13 కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 8, 9, 10 తరగతులతో పాటు ఇంటర్మీడియేట్‌కు చెందిన విద్యార్థులు 3,265 మంది ఉన్నారు. వీరికి రూ. 50 లక్షల నిధులతో ఇంటర్ యాక్టివ్ ప్లాట్ ప్యానెల్ ద్వారా ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించడంతో పాటు గణితం, ఫిజిక్స్, సైన్స్, ఇతర పాఠ్యాంశాల్లో అకాడమీ ద్వారా అంగ్ల మాధ్యమంలో బోధించేలా ఒప్పందం చేసుకున్నారు. ప్రతి రోజు గంట పాటు వీడియో క్లాసులు వినిపిస్తున్నారు. అయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు వచ్చే అనుమానాలను తొలగిస్తున్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులు ఐఐటీ, జేఈఈ, నీట్ ఫౌండేషన్ కోర్సు, ఇతర ఉన్నత సంస్థల్లో ప్రవేశాలు పొందే విధంగా శిక్షణ అందిస్తున్నారు. పాఠశాల స్థాయిలోనే సబ్జెక్ట్‌లలో పట్టు సాధించేలా చేయడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయి.



వీడియో పాఠాలు వింటున్న విద్యార్థులు

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

- సందీప్ కుమార్ ఝా, జిల్లా కలెక్టర్



విద్యార్థులందరూ శిక్షణను సద్వినియోగం చేసుకుని అన్ని పరీక్షల్లో రాణించాలి. ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి. అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

సబ్జెక్ట్‌లపై సంపూర్ణ అవగాహన

- హర్షిత, కేజీబీవీ, రుద్రంగి



ప్రత్యేక తరగతుల్లో సబ్జెక్ట్‌లపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది. ప్రతిరోజు తరగతి గదుల్లో గంట పాటు శిక్షణ అందిస్తున్నారు. ప్రతి సబ్జెక్ట్‌లో బేసిక్ అంశాలపై అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ అందిస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతలు.

ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి. గ్రామపంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 20 గ్రామపంచాయతీల్లో 645 దరఖాస్తులు, చందుర్తిలో 15 గ్రామపంచాయతీల్లో 213 దరఖాస్తులు, ఇల్లంతకుంటలో 24 గ్రామ పంచాయతీల్లో 1,054 దరఖాస్తులు, గంభీరావుపేటలో 17 గ్రామపంచాయతీల్లో 861 దరఖాస్తులు, కోనరావుపేటలో 15 గ్రామ పంచాయతీల్లో 277 దరఖాస్తులు, వేములవాడ అర్బన్ మండలంలో తొమ్మిది గ్రామ పంచాయతీల్లో 3,702 దరఖాస్తులు, ముస్తాబాద్ మండలంలో 1,074 దరఖాస్తులు, ఎల్లారెడ్డిపేట మండలంలో 16 గ్రామపంచాయతీల్లో 3,949 దరఖాస్తులు, తంగళ్లపల్లిలో 26 గ్రామపంచాయతీల్లో 3,784 దరఖాస్తులు, వేములవాడ రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 214 దరఖాస్తులు, రుద్రంగిలో రెండు గ్రామపంచాయతీల్లో 304 దరఖాస్తులు, వీర్నపల్లిలో మూడు గ్రామ పంచాయతీల్లో 71 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల పరిశీలనకు క్లస్టర్లుగా విభజించి వెయ్యి దరఖాస్తులకు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. అధికారులు ఇతర సర్వేలు రావడంతో పెండింగ్‌లోనే పడిపోయింది. క్రమబద్ధీకరణ కోసం దాదాపు ఐదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు.

నిరుపేద యువతికి పుస్తెమట్టెలు అందజేత



పుస్తెమట్టెలు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని దేవవ్వ-నర్సాగౌడ్ నిరుపేద దంపతుల కూతురు వివాహానికి మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ రాధారపు సత్యం సమకూర్చిన పుస్తెమట్టెలను స్థానిక నాయకులు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజునర్సాగౌడ్, భూపతిగౌడ్, సాయిగౌడ్, తిరుపతిగౌడ్, అంజాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, అజయ్, శ్రీధర్, మనోహర్, సంజీవరెడ్డి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి రంగనాయకసాగర్ జలాలు

- సీఎం రేవంత్‌రెడ్డి, కేకే మహేందర్‌రెడ్డిల చిత్రపటానికి రైతుల క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నర్సింహులపల్లె గ్రామంలోని సోమయ్య చెరువులోకి రంగనాయకసాగర్ జలాలు రావడంతో పాటు మత్తడి దూకుతుండడంతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అదివారం హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలోని సోమయ్య చెరువులోకి రంగనాయకసాగర్ నుంచి నీళ్లు తీసుకరావాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు జిల్లా కలెక్టర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. స్పందించిన కేకే మహేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులతో మాట్లాడి రంగనాయకసాగర్ కాలువలకు ఉన్నటువంటి నారాయణరావుపేట మండలం విఠలాపురంలో కాలువ నుంచి ఇల్లంతకుంట మండలం దాచారం శివారులోని అముదాలకుంట చెరువులోకి నీటిని మళ్లించి అక్కడి ప్రత్యేక కాలువ ద్వారా తంగళ్లపల్లి మండలంలోని చిన్న లింగాపూర్, నర్సింహులపల్లెలో చెరువులోకి మళ్లించారు. దీంతో ఆదివారం రంగనాయకసాగర్ కాలువలనుంచి నీళ్లు రావడంతో పాటు నర్సింహులపల్లెలోని సోమయ్య చెరువు మత్తడి దూక తుండడంతో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నర్సింహులపల్లె గ్రామంలోని చెరువులో సీఎం రేవంత్‌రెడ్డి, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బైరినేని రాము,నాయకులు, రైతులు ఉన్నారు.

సామాజిక కార్యక్రమాలతో సరైన గుర్తింపు

● ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యక్రమాలతో మంచి గుర్తింపు లభిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయ ఆవరణలో ఆదివారం అలయన్స్‌క్లబ్ సహకారంతో బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు అలయన్స్‌క్లబ్ మండలంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తు ప్రజలకు చేరువ అవుతుందన్నారు. మనం సంపాదించిన దానితో కొంతమేర దానధర్మాలకు వెచ్చించాలని సూచించారు. సంఘసభ్యులు ఐకమత్యంగా ఉంటు మరింత ఉన్నత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, ఇంటర్నేషనల్ క్లబ్ మెంటమర్ ఎలగందుల శ్రీనివాస్, డిస్ట్రిక్ గవర్నర్ కొంజర్ల మహేష్, మండలశాఖ అధ్యక్షుడు అల్లాడి ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కూనబోయిన బాలరాజు, పీఆర్‌ఓ బండారి నర్సయ్య, నార్ల లక్ష్మన్, కనుకయ్య, మామిడి రాజు, రేగుల కార్తీక్, సత్యనారాయణ, స్వామి, బండారి మాధవి, అనిత, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, బాలపోచయ్య, ఒగ్గు రమేష్, శంకర్, నరేందర్‌రెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో జాతీయస్థాయిలో
బాలికలకు బంగారు పతకాలు



కరాటేలో బంగారు పతకాలు సాధించిన కోనరావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలు

కోనరావుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్‌లో బాలికలు బంగారు పతకాలు సాధించారని కరాటే ఇన్‌స్ట్రక్టర్ మంగళగిరి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో షావెలిన్ కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫస్ట్ జాతీయస్థాయి ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కోనరావుపేట మండలం కనగర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బావుసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలికలు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. టీమ్ కటా విభాగంలో కనగర్తి పాఠశాలకు చెందిన పల్లవి, శరణ్య, రుచిత, వైష్ణవి, రేష్మ, నిత్య, రచన, నక్షత్ర, వర్షలు బంగారు పతకాలు సాధించగా, ఇండివిజల్ కటా విభాగంలో బావుసాయిపేటకు చెందిన గంగాదేవి, హర్షినిలు సైతం బంగారు పథకాలు సాధించినట్లు శ్రీనివాస్ తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు వినోద్ కుమార్, చంద్రశేఖర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ భూంరెడ్డి అభినందించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు నిర్వహిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, నాయకులు

చందుర్తి మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాజగోపురం ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం త్రిదండి దేవనాథ జీయర్ స్వామి వారిని కలిసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం వారితో కలిసి రాజగోపుర ప్రతిష్ఠలో పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చెలకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు ఈసరి శ్రీనివాస్, మల్లారపు రాజయ్య, ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

● వాహనదారుల ఇబ్బందులు



చంద్రంపేట రెండవ బైపాస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్

సిరిసిల్ల రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) :సిరిసిల్ల రెండవ బైపాస్ రోడ్డులో ఉన్న చంద్రంపేట జంక్షన్ ప్రమాదకరంగా మారిపోవడంతో ప్రమాదాల నియంత్రణ కోసం అర్‌అండ్ బీ అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయగా ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతుండగా వాహనాదారులు తీవ్ర గాయాలకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు 11కిలోమీటర్ల దూరం ఫోర్‌లైన్ బైపాస్ రోడ్డును నిర్మించారు. సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండలానికి ఉన్న ప్రధాన రోడ్డు చంద్రంపేట గ్రామం నుంచి ఉండడంతో నూతనంగా నిర్మించిన బైపాస్ రోడ్డు జంక్షన్ ఉండగా అక్కడ అర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల అ జంక్షన్‌లో జరిగిన పలు ప్రమాదాలల్లో గాయపడిన పలువురు అసుపత్రులల్లో చికిత్స పొందుతూ మృత్యుపడ్డారు. ఆ జంక్షన్‌లో స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో కామారెడ్డి నుంచి వేములవాడకు వెళ్లే వాహనాలు, వేములవాడ నుంచి కామారెడ్డికి వెళ్లే వాహనాలు వేగంగా వెళ్తుండటంతో సిరిసిల్ల నుంచి కోనరావుపేట వైపు వెళ్లే వాహనాలు సైతం వేగం వేళ్లుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనాదారులు ఆ జంక్షన్ వద్దకు వచ్చేసరికి భయంతో వణికిపోతున్నారు. దీనిపై గత సంవత్సరం జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సంబంధిత అధికారులతో కలిసి ప్రమాదాలకు నిలయంగా మారిన జంక్షన్‌ను పరిశీలించారు. ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌లను ఏర్పాటుచేయాలని ఆదేశాలు జారీ చేయడంతో డిసెంబర్‌లో అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి వారం రోజుల పాటు ట్రయల్ రన్ చేసి వదిలేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా వాటిని ప్రారంభించక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించడంతోపాటు స్పీడ్ బేకర్‌లను ఏర్పాటు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించాలి

- కంది భాస్కర్‌రెడ్డి, చంద్రంపేట



సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట గ్రామశివారులో నూతనంగా నిర్మించిన రెండవ బైపాస్ రోడ్డులోని జంక్షన్‌లో స్పీడ్ బేకర్లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిత్యం ప్రమాదాలు

- మొగిలి నాగరాజు, చంద్రంపేట



చంద్రంపేట శివారులో నిర్మించిన రెండవ బైపాస్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభించాలి.

సహకార సంఘాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



మానకొండూర్‌లో మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను రాష్ట్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార సంఘాల పదవి కాలం పూర్తవగా ప్రభుత్వం ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సహకార సంఘాలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మహిపాల్‌రెడ్డి, దండబోయిన శేఖర్, శాతరాజు యాదగిరి, కొట్టె రఘు నాయకులు తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఉల్లెంగుల ఏకనందం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల క్యాంపు కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏమ్మైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు.